క్లుప్తంగా

కుట్టు మిషన్ల పంపిణీ



మైలవరం: మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మైలవరం తహసీల్దారు అబ్దుల్ దరియా అన్నారు. ఆశాజ్యోతి ఫౌండేషన్ పాలడుగు వంశీకృష్ణ(యూఎస్ఏ) వారి సహకారంతో ట్రస్టు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబ్దుల్ దరియా ట్రస్టు సేవలను కొనియాడారు. పాలడుగు నాగేంద్రబాబు, ఉషారాణి మాట్లాడుతూ మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు 48 మిషన్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోయ సుధ, పారుపల్లి లీల, సుంకర దుర్గాప్రసాద్, నాగలక్ష్మి, సీఎంఆర్ ఫంక్షన్ హాల్ కోఆర్డినేటర్ జూలూరు రాము, మోస్ట్ ట్రస్టు కోశాధికారి ద్రోణవల్లి విజయలక్ష్మి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

మైలవరం: ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఉపాధ్యాయుల వారం రోజులు నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం తాలూకా స్థాయిలో అధికారికి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నంబర్ 57ను తక్షణమే అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, యాప్‌ల భారాన్ని తగ్గించి అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వసరాం, ఇబ్రహీంపట్నం మండలం అధ్యక్షుడు వి.నరేంద్ర, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, మునీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ముసునూరు: మండలంలోని ముసునూరు, గోపవరంలోని ఎరువుల దుకాణాలపై సోమవారం విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గోపవరం కోరమాండల్ ఎంటర్ ప్రైజెస్‌లో రూ. 1,55,110 విలువైన 5.350 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వల్లో తేడాలను గుర్తించి, సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. అలాగే ముసునూరు మహాలక్ష్మి ట్రేడర్స్‌లో తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బి.కన్యాకుమారి, ఎస్ఐ సీహెచ్ రంజిత్ కుమార్, వీఆర్ఓ, వీఏఏ పాల్గొన్నారు.

ఆలయంలో టెండర్లు వాయిదా



నూజివీడు: శ్రీకోట మహీషమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న దసరా మహోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాల నిర్వహణకు పిలిచిన టెండర్లను దేవదాయశాఖ అధికారులు వాయిదా వేశారు. మైక్‌సెట్ సప్లయ్ కోసం, షామియానా సామగ్రి సప్లయ్ చేయడానికి, ప్రసాదాల తయారీకి, భోజనానికి, పూల అలంకరణకు దేవదాయశాఖ ఈఓ వై.అలివేణీ శ్రీనాగలక్ష్మీదేవి టెండర్లు పిలవగా వాటిని సోమవారం ఓపెన్ చేశారు. భోజనాల తయారీకి మాత్రమే మూడు టెండర్లు రాగా అందులో తక్కువకు వేసిన పల్నాటి దుర్గకు టెండరును ఖరారు చేశారు. మిగిలిన వాటికి మరోసారి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ టెండర్ల ఓపెన్ కార్యక్రమాన్ని దేవదాయశాఖ గన్నవరం ఇన్‌స్పెక్టర్ కేవీ అనురాధ పర్యవేక్షించారు.

పన్నుల వాటా పెరుగుతోంది

మైలవరం: దేశ ఉత్పత్తిలో పన్నుల వాటా పెరుగుతోందని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ షేక్ కరీముల్లా తెలిపారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రంగారావు అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కరీముల్లా మాట్లాడుతూ పరోక్ష పన్నుల్లో వస్తు సేవల పన్ను ముఖ్యమైనదని పేర్కొన్నారు. దేశంలోని పన్నుల వ్యవస్థ, నూతన సంస్కరణలపై సర్టిఫికెట్ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ కరీముల్లా మాట్లాడుతూ ఈ కోర్స్ వల్ల విద్యార్థులకు పన్నుల వ్యవస్థ వాటి సంస్కరణలపై అవగాహన కల్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం. శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, కె.హరిబాబు, టి.సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూడిద దోపిడీకి వత్తాసు పలకడం సిగ్గుచేటు



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ శ్రీదేవి, నాగిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: బూడిద దోపిడీని ప్రశ్నిస్తే కూటమి నాయకులు దోపిడీదారులకు వత్తాసు పలకడం సిగ్గుచేటని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి పేర్కొన్నారు. బూడిద దోపిడీని ప్రశ్నించిన మాజీ మంత్రి జోగి రమేష్‌పై కూటమి నేతలు చేసిన వ్యాఖ్యలను సోమవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ అక్రమ బూడిద నిల్వలపై ఇన్‌కామ్ ట్యాక్స్, ఈడీ అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రావెల్ బూడిద దోపిడీకి పాల్పడిన ప్రజాప్రతినిధికి మైలవరం వీరప్పన్ అనే పేరు గతంలో మీరే పెట్టారని, ఇప్పుడు మా నాయకుడు అని గుండెలు చించుకోవడంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. బూడిద చెరువును ఇద్దరు ప్రజాప్రతినిధులు దోపిడీ చేస్తూ లారీ ఓనర్ల పొట్ట కొట్టారని విమర్శించారు. లారీ ఓనర్లకు న్యాయం జరిగేలా సమైక్యంగా ఉద్యమం చేసేందుకు మేము సిద్ధమని, మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ గుంజా శ్రీనివాస్, కుంచం జయరాజు, మిక్కిలి శరభయ్య, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, పట్టణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పోరంకి శ్రీనివాసరాజు, రెంటపల్లి నాగరాజు, నాయకులు నల్లమోతు దయాకర్, ఎస్.ప్రకాశ్, జి.రాణి, ఈశ్వరి, బొంతా సాంబశివరావు, బి.బాలాజీ, ఎస్.దుర్గారావు, గరికపాటి రాంబాబు, రాజేష్, ఎం.సాంబశివరావు, ఉయ్యూరు శ్రీనివాస్‌రెడ్డి, మేడా రాధ పాల్గొన్నారు.

ప్రజల ఇబ్బందులు పట్టవా..

మైలవరం: ఇబ్రహీంపట్నంలో బూడిద ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి బుర్రి ప్రతాప్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల కోసం మాజీ మంత్రి జోగి రమేష్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు.

మోక్షగుండం సేవలు ప్రశంసనీయం



మైలవరంలో విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది



తిరువూరులో విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మైలవరం: దేశానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు ప్రశంసనీయమని ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ జి. శ్రీకాంత్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య 164వ జయంతి పురస్కరించుకుని సోమవారం మైలవరం ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య నదీ జలాలు వృథా కాకుండా నదులపై ప్రాజక్టుల నిర్మాణానికి పునాదులు వేశారని తెలిపారు. మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో కూడా విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

తిరువూరు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమాన్ని సోమవారం తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య నేటి ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. అనంతరం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, అధ్యాపకులు మోజెస్, కిరణ్ కుమార్, రాంబాబు, దాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ తనిఖీ



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీసీపీ గున్నం రామకృష్ణ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను సోమవారం రాత్రి ఏడీసీపీ గున్నం రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు క్షుణంగా పరిశీలించి ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసులపై నిర్వహిస్తున్న కేసు డైరీని తనిఖీ చేశారు. అలాగే క్రైమ్ రికార్డులు పరిశీలించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వివరాలపై ఆరా తీశారు. సీఐ చంద్రశేఖర్‌ను అడిగి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల కేసులపై సత్వరం స్పందించాలని చెప్పారు. డ్రైవింగ్‌పై కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.

మోహనరావుకు కార్మిక రత్న అవార్డు



మోహనరావుకు కార్మిక రత్న అవార్డు అందజేసిన రజితశాండే

ఇబ్రహీంపట్నం: కార్మిక నాయకుడు, ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్129 రాష్ట్ర అధ్యక్షుడు మోదుగు మోహన్‌రావుకు కార్మిక రత్న అవార్డు లభించింది. మదర్ సర్వీసెస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ 3వ వార్షికోత్సవాలు విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు ఆడిటోరియంలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా ప్రజలకు సేవలు అందించిన పలువురికి అవార్డులు అందజేశారు. మదర్ సర్వీస్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు, సినిమా హీరోయిన్ కుమారి రజిత శాండే, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాది ప్రసాదరావు చేతుల మీదుగా మోహనరావు అవార్డు అందుకున్నారు. అవార్డు స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని ఆయన తెలిపారు. ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు మోహనరావును అభినందించారు.

అంతర్గత వివాదాలతోనే విగ్రహ ధ్వంసం



గంపలగూడెంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తిరువూరు: గంపలగూడెం మండలం తోటమూల రింగ్ సెంటర్‌లో టీడీపీ నేత ఇనుగంటి రాంబాబు విగ్రహాన్ని అంతర్గత వివాదాలతోనే ధ్వంసం చేశారని, ఆ సంఘటనతో వైఎస్సార్ సీపీకి ఎటువంటి సంబంధం లేదని ఆ పార్టీ నాయకులు స్పష్టంచేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్ కుమార్ మాట్లాడుతూ రాంబాబు విగ్రహాన్ని తోటమూలలో ఏర్పాటు చేయవద్దని టీడీపీ నాయకులే పలుమార్లు కలెక్టరుకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తమ పార్టీని ఈ వివాదంలోకి లాగొద్దని సూచించారు. సమావేశంలో గంపలగూడెం జెడ్పీటీసీ కోట శామ్యూల్, నాయకులు నరసారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, జొన్నలగడ్డ ప్రేమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, యూనియన్ నాయకులు

నందిగామ రూరల్: ట్యాక్సీ నంబర్ ప్లేట్ వాహనాలకు నందిగామ ఆర్టీవో కార్యాలయ వద్దనే బ్రేక్ చేయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. ట్యాక్సీ వాహనాలకు పాత పద్ధతిలోనే సేవలందించాలని కోరుతూ స్థానిక ఆర్టీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కారు, ఆటో, తదితర వాహనాల డ్రైవర్లు, యజమానులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్సీ ప్లేట్ వాహనాలకు గత ప్రభుత్వ హయాంలో నందిగామ ఆర్టీవో కార్యాలయంలోనే బ్రేక్ చేసేవారన్నారు. కాని కూటమి పాలనలో వాహనాల బ్రేక్ విధానాన్ని నున్నలోని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా అన్ని వాహనాలకు ఒకే చోట బ్రేక్ చేయించుకోవాల్సి ఉండటంతో నాలుగైదు రోజుల వ్యవధి పడుతోందన్నారు. దీంతో వాహనాల యజమానులు, డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాత విధానంలోనే వాహన సేవలందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీవో బాలకృష్ణను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11కేవీ మౌలానగర్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలానగర్, ఆంధ్ర హాస్పటల్ ప్రాంతం, ఆర్ కన్వెన్షన్ ప్రాంతం, వెంకయ్యనగర్, సీఎం సెక్యూరిటీ ఆఫీస్, ఎమ్‌కేఆర్ బిల్డింగ్ ప్రాంతం, దర్గా హరిజనవాడ కరకట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జగన్‌మోహనరావుకు నివాళి



చాట్రాయి: కొత్తగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు (రాజా) ఇటీవల మృతిచెందారు. సోమవారం పెద్ద కర్మ సందర్భంగా నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి జగన్‌మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల సీనియర్ నాయకుడు దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, నాయకులు కారంగుల వాసు, పరసా చెన్నారావు, చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, మిద్దె శివాజీ, చింతగుంట్ల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వేధింపులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): తనను, తన ఇద్దరు కుమార్తెలను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. నున్న గ్రామంలో తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటున్న మహిళ ఆగిరిపల్లికి చెందిన రవికుమార్ అలియాస్ రవికిరణ్‌తో గతంలో సహజీవనం చేసింది. అతని ప్రవర్తన బాగుండగా పంపివేసింది. అయినప్పటికీ తనను, తన కుమార్తెలను వేధింపులకు గురిచేస్తున్నట్లు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా హిందీ దినోత్సవం



విద్యార్థులకు హిందీ భాషపై పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నూజివీడు: మండలంలోని మద్దాయికుంట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం హిందీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయులు జవాజి పద్మ విద్యార్థులకు వ్యాసరచన, ప్రశ్నావళి, హిందీలో కథలు చెప్పడం వంటివి నిర్వహించి బహుమతులు అందజేశారు. వివిధ హిందీ చార్ట్‌లను ప్రదర్శించి విద్యార్థుల్లో హిందీ భాష పట్ల మక్కువను పెంపొందించేందుకు కృషి చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు ఇబ్బంది పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు ఎర్రబాల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

నూజివీడు: మండలంలోని మీర్జాపురంకు చెందిన సురేష్ అనే వ్యక్తిపై సోమవారం దాడి జరిగింది. వివాహితను వేధిస్తుండటంతో వివాహిత సంబంధీకులు సురేష్‌పై దాడి చేశారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మందుల షాపు వద్దకు సురేష్ వెళ్లగా అక్కడ జరిగిన దాడిలో గాయపడిన అతను ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు.

జాప్యం లేకుండా అర్జీలను పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ వినూత్న



నూజివీడులో అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న సూచించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి 50 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ ఆర్ హేమ, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, సీడీపీఓ పిల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అర్జీల్లో పలు సమస్యలు ఇలా ఉన్నాయి:

- నూజివీడు పట్టణంలోని తిరువూరు రోడ్డులో క్వాలిటీ పెంకు ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న ఇంటి మీదకు వడ్లకట్ట చెరువుకు నీళ్ల వెళ్లు వాగు ఆక్రమణకు గురైంది. దీంతో భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి ఇంటి చుట్టూ చేరుతూ మట్టి కోతకు గురై కూలిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ అడ్డగర్ల శ్యామ్‌సన్ అర్జీని అందజేశారు.
- నూజివీడు మండలం వెంకటాయపాలెంలో 21.96 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే మా భూమికి పక్కనే ఉన్న గంగుల వడ్డీకాసులు అనే అతను తన భూమిలో మా బోర్లకు 80 మీటర్లు, 40 మీటర్ల దూరంలోనే రెండు బోర్లు అర్ధరాత్రి సమయంలో వేయించి, వాటికి విద్యుత్ కనెక్షన్‌ను పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ రెండు బోర్లు ఉపయోగిస్తే మా బోర్లలో నీరు తగ్గిపోయే ప్రమాదం ఉన్నందున వాటికి విద్యుత్ కనెక్షన్‌లను నిలుపుదల చేయాలని నూజివీడుకు చెందిన కెత్తే సురేష్‌కుమార్ అర్జీని అందజేశారు.
- ముసునూరులో ఆర్అండ్‌బీ రోడ్డు మలుపు తిరిగే వద్ద పిన్నిబోయిన సీతారాములు అనే అతను ఐదు అడుగుల మేరకు రోడ్డును ఆక్రమించి స్తంభాలు పాతి ఐరన్ ఫెన్సింగ్ వేశాడని, దీంతో ఇక్కడ వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్నందున ఆక్రమణను తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు అర్జీని అందజేశారు.

హామీల అమలులో కూటమి విఫలం



తిరువూరులో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. సోమవారం తిరువూరు ఒకటో వార్డులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపిన కూటమి పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అరకొరగా సంక్షేమ పథకాల అమలుతో మమ అనిపించిన కూటమి ప్రభుత్వం అన్నీ అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, రామవరపు మంజుల, గుంటూరు మస్తాన్, ఏరువ ప్రకాష్‌రెడ్డి, నాయకులు యరదేశి రామారావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, షేక్ జాకీర్, కొలికపోగు నాగరాజు, తిరుమలశెట్టి వేణుబాబు, మోషే, మంచాల మల్లేశ్వరరావు, దినేష్, సత్యవతి, లక్ష్మి, వహాబ్, నాయని కోటేశ్వరరావు, గుమ్మా పాపారావు, మోదుగు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



బత్తులవారిగూడెంలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది



వేల్పుచర్లలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి వెంకట చైతన్య

మైలవరం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ హనుమంతరావు తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు పశు వైద్యశాలలో సోమవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ టీకాల వల్ల పశువుల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా పాల ఉత్పత్తిలో నాణ్యతను పెంచుతాయన్నారు. వచ్చే నెల 15వ తేదీ వరకు ఇంటి వద్దకే వచ్చి టీకాలు వేస్తారని, ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకులు హరిహరనాథ్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ సుమన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు వి.కుమార్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అప్పిడి సాంబిరెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

నూజివీడు: మండలంలోని బత్తులవారిగూడెంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సర్పంచి ముసునూరు లక్ష్మీకాంతమ్మ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించగా పశువైద్యాధికారి దుర్గాభవాని ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు హనుమంతరావు ఇబ్రహీంపట్నంలో సోమవారం ప్రారంభించారు. పాడి రైతులు నాలుగు నెలలు దాటిన దూడల నుంచి టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం మూలపాడు, జూపూడి, కేతనకొండ గ్రామాల్లో టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: పశువుల్లో వ్యాధులను నివారిస్తే పశు పోషకులు లాభాలు పొందవచ్చని మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య సూచించారు. సోమవారం వేల్పుచర్లలో 155 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'నారీ అభియాన్' సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నారీ సశాక్ అభియాన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాదు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ పథకంపై అవగాహన కల్పించడానికి ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.